

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఆలయాల అభివృద్ధి కోసం నిధులు : మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట నియోజకవర్గంలో పలు అలయాల అభివృద్ధి కోసం రూ. 1 కోటి 98 లక్షల 50 వేల నిధులు మంజూరు వచ్చినట్లు మంత్రి హరీష్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సిఎం కెసిఆర్ ధార్మిక దార్శనికుడని రాష్ట్రంలో అనేక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 50కి పైగా అలయాలను అభివృద్ధి చేసుకున్నామని మరో అరు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు వచ్చినట్లు తెలిపారు. చిన్నకోడూరు మండలం సలేంద్రి అతిపురాతన ప్రాచీన అలయం శ్రీశివా లయం(రామలింగేశ్వర) రూ.50 లక్షలు. వితలాపూర్‌లో ఎన్నో ఏండ్ల చరిత్ర కలిగిన గుట్టపై వెలిసిన శ్రీ వితలేశ్వరస్వామి అలయంకు రూ.42 లక్షలు, నారాయణరావుపేట మండలంలోని పురాతన అల యం శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి అలయంకు రూ.39 లక్షలు, సిద్దిపేట పట్టణంలోని శ్రీ పెద్దమ్మ దేవాల యం అభివృద్ధికి రూ.30 లక్షలు, హనుమంతుపల్లి ఇరుకోడు పెద్దమ్మ అలయం మిలుగు పనులకు రూ.20 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని శ్రీ మహంకాలి దేవాలయంకు రూ.17.50 లక్షల నిధులు మంజూరు వచ్చినట్లు వివరిచారు. త్వరలోనే టెండర్లు పలిచి పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

## ఆవాలతో అద్భుతంగా లక్ష్మీదేవి చిత్రపటం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా ఆవాలతో వినూత్నంగా లక్ష్మీదేవి చిత్రాన్ని చిత్రించి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ శ్రావణమాసం అంతా కూడా భక్తులు భక్తి శ్రద్ధలతో భగవంతున్ని పూజించుకుంటారన్నారు. శ్రావణమాసం వరలక్ష్మీదేవి వ్రతం పూజలో ప్రతి మహిళ కూడా పాల్గొని అమ్మవారి కరుణ కటాక్షాలు పొందుతారన్నారు. ఆవాలతో లక్ష్మీదేవి చిత్రాన్ని భక్తులు తిలకించి అద్భు తంగా ఉందని కొనియాడారు. భక్తుల సందర్శనార్థం రెండు రోజుల పాటు రామకోటి కార్యాలయంలో ఉంచబడుతుందని తెలిపారు.




లక్ష్మీదేవి చిత్రంతో రామరాజు



శ్రీ టౌన్ పోలీసు స్టేషన్ నిర్మాణ నమూన చిత్రం

## రూ. 4 కోట్ల 44 లక్షలతో త్రీ టౌన్ పోలీసు స్టేషన్ నిర్మాణం

**సిద్దిపేట రూరల్, అగస్టు 25, ప్రభాతవార్త:** ప్రజల రక్షణ..శాంతి భద్రతల పరిరక్షణ కోసం సిద్దిపేట పరిధిలో పెరిగిన జనాభా దృష్ట్యా సిద్దిపేటకు త్రీ టౌన్ పోలీసు స్టేషన్ మంజూరు కాగా గత రెండు సంవత్సరాల నుంచి తాత్కాలిక భవనంలో కొనసాగుతువస్తుంది. ఈ క్రమంలో రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని త్రీ టౌన్ పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం రూ,4 కోట్ల 44 లక్షల నిదులు మంజూరు చేయించారు. దీంతో త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌కు శాశ్వత భవనం నిర్మించనున్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు రంగధాంపల్లిలో ఈనెల 26న మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా త్రీ టౌన్ పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నారు. త్రీ టౌన్ మోడల్ పోలీసు స్టేషన్‌గా నిలువనుంది.

## హుస్నాబాద్ వెనకబాటుపై గళమెత్తి గర్జిస్తాజ..!

### మాజీ పార్లమెంట్‌సభ్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు25, ప్రభాతవార్త :** తెలంగాణ సిద్ధించాక ఏర్పడిన ప్రభుత్వంలో హుస్నాబాద్ శాసనసభ్యునిగా ప్రాతినిథ్యం వహించిన సతీష్‌కుమార్‌తో అనుకన్నంతగా అభివృద్ధి జరగలేదని ఈ అభివృద్ధిపై శాసనసభలో తాను గళమెత్తి గర్జిస్తానని మాజీ పార్లమెంట్‌సభ్యులు, హుస్నాబాద్ శాసనసభ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకుంటున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి శ్రీస్వయంభూరాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామివారి అశీస్సులు తీసుకున్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని శ్రీరేణుకాఎల్లమ్మ దేవస్థానంలో సైతం మొక్కలు చెల్లించుకుని విలేఖరులతో మాట్లాడుతూ ఇక్కడి ప్రజల అశీస్సులతోనే తాను బరిలో దిగుతున్నానని ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపిస్తే ఇక్కడి ప్రాంత ప్రజల కష్టం తీరుస్తానని హామీ ఇచ్చారు. అలాగే హుస్నాబాద్ ప్రాంతంలో తాను ఎల్లపుడూ అందుబాటులోనే ఉంటానని ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని బలహీనవర్గాల ప్రజలు తనను ఆశీర్వదించి శాసనసభకు పంపాలని విజ్ఞప్తి చేసుకున్నారు.

## కలెక్టరేట్ ఎదుట బిజెపి శ్రేణులు ఆందోళన

### అదుపులోకి తీసుకున్న పోలీసులు



బిజెపి శ్రేణులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**సిద్దిపేట రూరల్, అగస్టు 25, ప్రభాతవార్త:** అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బిజెపి శ్రేణులు అందోళన నిర్వహించారు. కలెక్ట రేట్‌లోకి చొచ్చుకొని పోవడానికి పార్టీ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకొని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అర్హులకు డబుల్ బెడ్ రూంలు, గృహాలక్ష్మీ పథకం, దళితబంధు ఇవ్వడంతో పాటు నిరుదోగ్య భృతి చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా కెసిఅర్‌కు, మంత్రి హరీష్ రావుకు వ్యతిరేకంగా, బిజెపికి అనుకూలంగా నినాదా లు చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు శ్రీకాంత్‌రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, దారం గురువారెడ్డి, సొప్పందడి విద్యా సాగర్, పత్రి శ్రీనివాస్ యాదవ్, నర్సింహ్మారెడ్డి, తోడుపూనూరి వెంకటేశం, అంబటిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి

**చిన్నశంకరంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పౌరుడు ఓటరు జాబితాలోనమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమ గోడ పత్రికను ఆవిష్కరించారు. మండలంలో నేడు, రేపు రెండు రోజుల పాటు సెప్టెంబరు 2,3వ తేదిలలో ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని, ఎలాంటి తప్పులు దోర్లిన, మార్పులు చేయాలన్నారు. నూతన ఓటరు జాబితాలో చేరాలన్నా అధికారులకు సూచించాలన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# అక్కన్నపేటలో నిఘానేత్రం కనుమరుగు..!

**-మండలంలో ఎక్కడా పనిచేయని సిసి కెమెరాలు**
**-దృష్టిసారించని పోలీస్‌యంత్రాంగం**



అక్కన్నపేట మండలంలోని సిసికెమెరాల దృశ్యం

**అక్కన్నపేట, ఆగస్టు25, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలంలో నిఘావ్యవస్థ నిద్రపోతోంది. మండలంలో ఎక్కడా సిసికెమెరాలు పనిచేస్తున్న జాడలు కనపడుతలేవని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. నిఘా వ్యవస్థలోని సిసికెమెరాల పనితీరుపై పోలీస్‌యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలో 31గ్రామపంచాయితీలుండగా ఇందులో సగానికి పైగా గ్రామాల్లో సిసి కెమెరాలు పనచేయకుండా మొరాయించి నిద్రలోకి జారుకున్నట్లు ప్రజాప్రతినిధులు చెపుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో అక్కన్నపేట మండలంలో పలు దొంగతనాలు జరిగినపుడు పోలీసుల పరిశోధనకు సిసి కెమెరాలు ఎంతగానో ఉపకరించి దొంగలను పట్టించిన దాఖలాలు ఉన్నాయి. కేశ్నాయక్‌తండ గ్రామంలో మూగజీవాలైన పశువుల దొంగతనం కేసులో సిసికెమెరాల వల్లనే దొంగలు దొరికిన సంఘటనతో పాటు కుందనవానిపల్లి గ్రామంలో గొర్రెల దొంగతనం కేసులోనూ సిసికెమెరాలు దొంగలను పట్టించిన సంగతి విదితమే. ఇదిలా ఉండగా ప్రస్తుతం సిసి కెమెరాల విషయంపై పోలీస్‌శాఖ అసలు దృష్టిసారించలేకపోవడంతో వాటి పనితీరుపై పట్టించుకునే నాదులే కరవయ్యారు, గతంలో హుస్నాబాద్‌లో ఏసిపిగా విధులు నిర్వర్తించిన సందెపోగు మహేందర్ సిఐ లేతాకుల రఘుపతిరెడ్డి, ఎస్ఐ కొత్తపల్లి రవిందర్‌లు ఒక ఉద్య మంలా గ్రామస్థులను పురికొల్పి చైతన్యం చేసి విరాళాలు సేకరించి సిసికెమెరాలను ఏర్పాటు చేయిం చారు. కొన్ని గ్రామాల్లో కార్భన్‌వచ్చి సిసి కెమెరాలకు ఇక్కట్లు జరుగుతండగా మరి కొన్ని చోట్ల పూర్తిగానే పనిచేయకుండా ఉంటున్నాయి. ఇందులో ఒక విశేషమేమిటంటే మద్యం దుకాణ ప్రాంతంలోనైతే ఫర్‌ఫెక్ట్‌గా పనిచేస్తున్నట్లు పలువురు చెపుతున్నారు. ప్రస్తుతం ఈ విషయంలో పోలీస్ అధికారులు ఎలాంటి గ్రామస్థుల్లో చైతన్యం కల్పించకుండా గాలికి వదిలేసిన విషయంపై ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, ఇలాంటి దొంగతనాలకు అడ్డులేకుండా పోతున్న విషయంపై పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎలాంటి కార్యక్రమాలు జరగకుండా ముందస్తుగా పోలీస్‌శాఖ సిసికెమెరాల పనితీరుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమీకృత కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

## సమీకృత కార్యాలయ సముదాయాన్ని అతి త్వరలో ప్రారంభిస్తాం

### -జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**హుస్నాబాద్, ఆగస్టు25, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో రూ 17కోట్ల వ్యయంతో అత్యాధునిక పద్దతిలో నిర్మిస్తున్న సమీకృత కార్యాలయ సముదాయాన్ని అతి త్వరలో ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తెలిపారు. శుక్రవారం రోజున ఈ కార్యాలయ నిర్మాణ పనులను హుస్నాబాద్ ఆర్‌డివో బెన్ షాలోమ్‌తో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కార్యాలయాలను ప్రజలందరికి ఒకే చోట సులబమైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని డివిజన్ కేంద్రంలో ఉన్న ఆర్డీవో, తహశీల్ధార్, ఇంజనీరింగ్, ఆర్ అండ్‌బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ, ఆటవీ రెంజ్, ఎస్టిఓ కార్యాలయాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యాలయాలు సిబ్బందితో సహా సామాగ్రి త్వరగా తరలించాలని కావాల్సిన పర్నిచర్‌ను అందజేస్తామన్నారు. కార్యాలయంలో విద్యుత్, నీరు, కార్యాలయానికి వెల్లేందుకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనగాం రోడ్డు నుండి కార్యాల యానికి వెల్లే దారిలో బటర్‌ప్లై లైట్లతో ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో పాలిటెక్నిక్ కళాశాలకు భవిస్యత్తులో సైతం ఎలాం టి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిఓ బాల్‌రాజు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌తో పాటు నిర్మాణ ఏజెన్సీ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

### మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు



కృష్ణస్వామికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**సిద్ధిపేట రూరల్, అగస్టు 25, ప్రభాతవార్త :** ముదిరాజ్‌లు రాజకీయంగా, అర్థికంగా, విద్యా పరంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, హైదారాబాద్ మాజీ మేయర్, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ముదిరాజ్ సంఘం స్థాపకుడు, వ్యవస్థాపక అధ్యక్షులు కొరిమి కృష్ణస్వామి 130 జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ జర్నలిస్టు సంఘం, ముదిరాజ్ మహాసభ ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అయన సేవలను కొనియాడారు. అనంతరం కనకరాజు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం నాయకుల జయంతిలను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్ జర్నలిస్టులు రామకృష్ణ, పరమేశ్వర్, యాదగిరి, బైరీ సతీష్, వెంకన్న, వెంకట్, బాలేష్, తిరపతి, పిట్ల శ్రీనివాస్, ధర్మ, తుపాకుల బాల్‌రంగం, మిద్దె రవి, జంగిటి శ్రీనివాస్, పిట్ల రాజయ్య, రాజన్న, నర్సింలు, బైరీ యాదగిరి, లక్ష్మణ్, శ్రావణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్టాప్ టాలరెన్స్ నూతన పుస్తకం ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ఆర్యవైశ్య యువ నాయకుడు గజ్వేల్ పట్టణానికి చెందిన బెల్దె మణికంఠ రచించిన స్టాప్ టాల రెన్స్ అనే పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి చేతలుమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు వినూత్న ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని, బెల్దె మణికంఠ చిన్న వయసులో పుస్తకాన్ని రచించి సమాజానికి అందించడం శుభసూచకమన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక గొప్పతనం ఉంటుందని, దానిని పసిగట్టి ఉన్న త స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బెల్దె మణికంఠ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహనంతో ఉండాలని, సహనం వల్ల అనూహ్య పరిణామాలు చోటుచేసు కుంటాయని, జీవితం ఆనం దంగా ఉంటుందని అన్నారు. పుస్తకంలో మానవ మనుగడ కోసం మానవాళికి ఉపయో గకరమైన విశేషాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్ గోపాల్‌రెడ్డి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్, జగదేవ్‌పూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రచర్ల నరేష్ తదితరులు ఉన్నారు.

## సిఎం కెసిఆర్ పచ్చి అవకాశవాది

### సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార ్యదర్శి మల్లారెడ్డి

**కొమురవెల్లి, అగస్టు 25, ప్రభాతవార్త :** సిఎం కెసిఅర్ పచ్చి అవకాశవాది అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం కొమురవెల్లి సీపీఎ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిఎం కెసిఅర్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. వామపక్షాల అధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో బిఅర్ఎస్ పార్టీని ఓడించి తీరుతామని తెలిపారు. సిఎం అవసరానికో అబద్దం అడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని రాష్ట్ర ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారని తెలిపారు. అప్పుడు మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో బిజెపిపై కుస్తీ పట్టి గెలిచి ఇప్పుడు గెలవడానికి బిజెపితో దోస్తీ చేస్తున్నాడని అరోపించారు. 9 ఏండ్ల పాలనలో పేదల బతుకులు మారలేదని ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సిపిఎం పార్టీ సిఎం కెసిఅర్‌ను అనేకసార్లు ధైర్యంగా నిలదీసిందని తెలిపారు. ప్రభుత ్వం ఇచ్చిన హామీల అమలు కొరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజల సంపదను అత్యధికంగా దోచుకున్నది కెసిఅర్ ప్రభుత్వం వారీ ఎమ్మెల్యేలే అని అరోపించారు. వచ్చే ఎన్నికల్లో బిఅర్ఎస్ పార్టీని ఓడించి తీరుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, రాళ్లబండి నాగరాజు, సార్ల యాదయ్య, అరుట్ల దయానంద్, చెరుకు వెంకటరెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ అంటే భయం

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి, పాల్గొన్న ప్రతినిధులు ఆవుల రాజిరెడ్డి, రెడ్డి ఆంజనేయులు గౌడు, పోమన్న రవీందర్ రెడ్డిలు

**కౌడిపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ డిసెంబర్‌లో జరిగబోయే అసెంబ్లీ ఎన్నికలకు గాను 105 స్థానాలలో టికెట్లను ఖరారు చేసినప్పటికి, నర్సాపూర్ నియోజకవర్గంకు అభ్యర్థి ఎవరని అదిష్టానం తెల్చుకోక పోవడానికి బిఆర్ఎస్‌కు కాంగ్రెస అంటే భయమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు మండల పరిధిలోని కుషన్‌గడ్డ తండా, తిమ్మాపూర్, రాయిలాపూర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజి రెడ్డి, టిపిసిసి ప్రతినిథి రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడు, డెలిగెడ్ పోమన్నగారి రవిందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. కౌడిపల్లి మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ కాంగ్రెస్ పార్టీ జెండా విష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకోని, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. రాయిలాపూర్ గ్రామంలో పార్టీ అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతు బిఆర్ఎస్ అభివృద్ధి ప్రజల్లో లేదని కేవలం వారి నాయకుల వద్ద ఉందని ఆయన ఎద్దెవ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుండి మూడు పర్యాయాలు ఎమ్మెల్యే గెలిచి, శిశు సంక్షేమ శాఖ మంత్రి, చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన సునీతారెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిన తర్వాత రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారి ఎంపిగా పార్టీ నుండి ఓడిపోయి, సామాన్య కార ్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా తన స్వార్థం కొసం బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకుని, నేడు కేబినేట్ హోదలో రాష్ట్ర మహిళ కమీషన్ చైర్‌పర్సన్‌గా పదవిలో ఉండి నియోజక వర్గంకు ఏమి చేశారని ఆయన ప్రశ్నించారు. ఆపద కాలంలో ఆధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ బరువు బాధ్యతలను ఆవుల రాజిరెడ్డి, సోమన్న గారి లక్ష్మిరవిందర్‌రెడ్డి, రెడ్డిపల్లి ఆంజనేయుల భుజస్కందాలపై నడిపించినామని ఆయన గుర్తు చేశారు. నేడు బిఆర్స్ పార్టీ నుండి నర్సాపూర్ అసెంబ్లీ టికెట్ ఖరారు చేయకపోతే, కా ంగ్రెస్ పార్టీలోకి మారి టికెట్ పొందుతామని కలలు కనవద్దని, ఇది ఆర్టీసి బస్సు కాదు ఖర్చీప్ వేసి రిజర్వేషన్ చేసుకోవడానికి, ఒక వేళ సునీతారెడి పార్టీలోకి వచ్చిన అధినాయకులు, కార్యకర్తలు ఒప్పుకోరు అని ఆయన ఖరాఖండిగా తెల్చిచేపేశారు. ఇక అధిష్టానమే ప్రస్తుత సిట్టింగ్ నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డికి టికెట్ ఇవ్వాలని హరీష రావు గుమ్మం ఎదురుగా పడిగా ల్పులు కాసి అర్థించుకోనే స్థాయికి దిగజారిపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. అనంతరం టిపిసిసి ప్రతినిథి రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడు మాట్లాడుతు కాంగ్రెస్ జేండాపండగలు అంటే ఊర్ల పండుగాల ఉంటుందన్నారు. బిఆర్ఎస్ నిర్మించిన అవినీతి రోడ్డులపైఎన్నో ప్రమాదాలు జరగురుతున్న పట్టించుకోనే నాధుడు లేరని ఆయన అన్నారు. చెల్లని రూపాయి సునీతారెడ్డి అన్ని విమర్శించె కేసిఆర్ ఇప్పుడు నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్ ఏవిధంగా ఇస్తున్నట్లు ఆయన ప్రశ్నించారు? తన రాజకీయ జీవితం గడుపుకోవడానికి సునీతారెడ్డి జాతికి నేత కేసిఆర్ అని ఎలా అంటున్నావు.. 1200 మంది విద్యార్థులు బలవన్మరణాలు కనిపించలేవా తల్లి అని ఆంజనేయులు గౌడు అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు జిల్లా కాంగ్రెస ప్రదాన కార్యదర్శి వెంకట్రావ్‌పేట పాషా, మండల బిసి సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడు, ఎస్టీ సెల్ అధ్యక్షులు లక్ష్మన్, నాయకులు అల్మాయిపేట లింగం, కౌడిపల్లి పాషా, ముత్రాజ్‌పల్లి శ్రీనివాస్ గౌడు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధన్‌సింగ్ నాయక్, పర్వతాలు, పాం శేఖర్, తిమ్మాపూర్ నర్సింలు, శంకర్ గౌడు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దక్షిణ భారతదేశ క్విజ్ పోటీలో మర్కుక్ విద్యార్థులు




ప్రశంసా పత్రాలు, బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మర్కుక్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు హైద్రాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక లక్ష్యదీప్, పాండిచ్చేరిలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి మండల పరిధిలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగచైతన్యరెడ్డి, కీర్తనలు పాల్గొని పోటీల్లో తృతీయ బహుమతి గెలుపొందగా వారికి ప్రశంసా పత్రాలతో పాటు రూ.40వేల విలువ చేసే టాబ్ నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్, ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ దక్షిణ భారతదేశ స్థాయిలో క్విజ్ పోటీలో పాల్గొని రాష్ట్రానికి, సిద్దిపేట జిల్లాకు, మర్కుక్ మండలానికి గుర్తింపు తెచ్చారని విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు డిఈఓ, ఎంఈఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, మండల పిఆర్‌టియు అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయులు పద్మ, అజార్‌అహ్మద్‌లు అభినందించారు.

# ముఖ్యమంత్రి దృష్టికి కార్మికుల డిమాండ్లు



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ఎమ్మెల్యే మాధవరం**

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 25, ప్రభాతవార్త : కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఇటీవల జిహెచ్ ఎంసి కార్మికులు తమను శాశ్వత నియామకాలు కింద తీసుకోవాలనే ఉద్ధేశ్యంతో చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం కూకట్‌పల్లి జోన్ మున్సిపల్ కార్యాలయం మూసాపేటలోని కార్మికులు వద్దకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెళ్లి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఒక కార్మికుడినేని కార్మికుల బాధను అర్థం చేసుకున్న వ్యక్తిగా తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా గతంలో 6వేలు ఉన్న జీతాన్ని నేడు రెట్టింపు చేసి 17,500 చేసిన నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని తమ డిమాండ్లను తప్పనిసరిగా ఆయన దృష్టికి తీసుకెళ్తానని ఖచ్చితంగా సానుకూలంగా స్పందిస్తారని ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు.

## ఆత్మవిశ్వాసంతో యువత ముందగుడు వేయాలి : ఎమ్మెల్యే వివేకానంద్



శ్రీ నవశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ను అవిష్కరిస్తున్న కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ తదితరులు

**నవశక్తి సంక్షేమ సంఘ కార్యవర్గ ఏర్పాటు**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 ప్రభాతవార్త : యువత స్వశక్తితో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని సత్తాచాటాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం శ్రీ నవశక్తి వెల్ఫేర్అసోసియేషన్ నూతన కార్యవర్గ ఏర్పాటు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ్‌నగర్ బి కి చెందిన శ్రీ నవశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎం.డి.మజీద్, ఉపాధ్యక్షులుగా బబ్లు, జి.బాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎన్.హారీష్‌కుమార్, ఎండి. అహ్మద్ అలీ, కోశాధికారిగా రాకేశ్ కేసరి, క్రియాశీలక అధ్యక్షులుగా ఎ.నరేందర్, రఫియుద్దీన్, కార్యదర్శులుగా యు.నాగరాజు, ఎస్.వెంకయ్య, ఎం.డి. అహ్మద్, పి.శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, సి.వెంకటేశ్, సలీమ్, సహాయ కార్యదర్శులుగా ఎం.డి.నజీర్, ఎం.డి.అప్జల్, సభ్యులుగా చాంద్‌పాషా, అశ్వక్, రమేశ్, చిన్నా, షరీఫ్, కుమార్, అజీమ్, ఇస్మాయిల్, ఎండి. సల్మాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారలుగా శాసనసభ్యులు కె.పి.వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, శంభీపూర్‌రాజు, డి.విజయరామిరెడ్డి, డి.తిరుపతిరెడ్డి, సిహెచ్.మధుబాబు, సంజీవ రెడ్డి, పాండురెడ్డి, ఎన్.గోపిలను ఎన్నుకున్నారు.

## ప్రతి ఒక్కరు గెలుపుకోసం కృషి చేయాలి

**ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి**



ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎల్ఆర్‌ను సన్మానిస్తున్న కార్పోరేటర్ పన్నాల ఇతర నేతలు

నాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు గెలుపుకోసం కృషి చేయాలని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవాంర మల్లాపూర్ డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో బిఎల్ ఆర్ సమావేశం అయ్యారు. అందరు కలిసి కట్టుగా ఉండి పార్టీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని బిఎల్ఆర్ చెప్పారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు, బిఎల్ఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపోలు సతీష్, చిగుళ్ల శ్రీనివాస్, కుంటి కృష్ణ, తీగుళ్ల శ్రీనివాస్, కటర్ల భాస్కర్, తండా వాసుగౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, ధర్మారెడ్డి, నాగారం బాబు, దుర్గయ్య, శోభ, కోటేశ్వరీ, బుసాని రఘు, విజయ్ భాస్కర్, సుశీల, లక్ష్మి, అల్లూరి నరేందర్ రెడ్డి, నయిమ్, పీరు నాయక్, శంకర్ నాయక్, పద్మరెడ్డి, మారుతి, అల్తాఫ్, బాసిత్ పాల్గొన్నారు.

## మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన గండిపేట బిఆర్ఎస్ నాయకులు



నార్సింగి, ఆగస్టు 25 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డికి శుక్రవారం గండిపేట మండల బిఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, నార్సింగి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ శివారెడ్డి, సీనియర్ నేతలు గోపాల గణేష్, దారుగుపల్లి యాదగిరిలు మంత్రిని సన్మానించారు. సందర్భంగా నర్సిహ్మా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రెండోమారు మహేందర్‌రెడ్డి మంత్రి పదవిని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, పార్టీ పటిష్టతలో మహేందర్‌రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. మహేందర్‌రెడ్డి నుంచి రంగారెడ్డి జిల్లాలోని చాలా మంది నాయకులు స్పూర్తి పొంది, రాజకీయంలో రాణిస్తున్నారని నర్సిహ్మాతెలిపారు.

## సిఎం కెసిఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సులు అమలు సాధ్యం

**తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర**



హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: సిఎం కెసిఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సులు అమలు సాధ్యం అని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర పేర్కొన్నారు. బీపీ మండల్ జయంతి సభ నల్లకుంటలోని రత్నానగర్‌లో బీసీ జాగృతి ఆధ్వర్యంలో జరిగింది. బీపీ మండల్ చిత్రపటానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపేంద్ర నివాళులు అర్పించి ప్రసంగించారు. దేశాన్ని ఎక్కువకాలం పరిపాలించిన కాంగ్రెస్, బిజెపిలు మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకపోవడం అన్యాయమని, మండల్ కమిషన్ 1980లోనే దేశంలో కులగణన జరగాలని చెప్పారని, కానీ నేటికి కులగణన జరగకపోవడం బీసీల పట్ల వారి వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలని,బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో 33శాతం బీసీలకు రిజర్వేషన్‌లు ప్రకటించాలని, మండల్ కమిషన్ ద్వారానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్‌లు బీసీలకు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెపి.మురళీకృష్ణ, కత్తుల సుదర్శన్, కార్యదర్శి పాతకోటి మహేష్, కార్యవర్గసభ్యులు ఎం.బి.కిషోర్, ప్రశాంత్ మూదిరాజ్, సురేందర్, బస్తీ నాయకులు వెంకటేశ్, జహర్ పాల్గొన్నారు.

## మణిపూర్ బాధితులు అధైర్య పడవద్దు : పూల ఆంథోనీ





మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనకు నిరసనగా సికింద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనకు నిరసనగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని వివిధ చర్చిల ఫాదర్లు,క్రైస్తవ సంఘ నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్చి బిషప్, ఆఫ్ హైదరాబాద్ కార్డినల్ పూల ఆంథోనీ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ఒక వర్గంపై హింసాత్మకమైన దాడులు జరుపడం సరైంది కాదన్నారు. చర్చిలు ధ్వంశం చేస్తూ అల్లర్లు సృష్టిస్తూ ప్రజా స్వామ్య విలువలను లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు జీవకన్, మైఖేల్, లియో, వాయుడిన్ బ్రోత్, విక్టర్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేగంబజార్, ఆగస్టు25ప్రభాతవార్త:శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్,అండ్ వెస్ట్‌జోన్ అడిషనల్ డిసిపి మొహమ్మద్ ఆశ్వాక్,గోషామహల్ ఎసిపి కె.వెంకట్‌రెడ్డిలు రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టడం జరుగతుందన్నారు. పండుగలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో సిఐ.రవికుమార్,అదనపు ఇన్స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు అస్లాం,అంబికా, సాయికృష్ణ,శ్రీరాములు తదితరులు ఉన్నారు.

## బస్తీవాసులకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి



వినతి పత్రం అందిస్తున్న నేతలు

అల్వాల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: దశాబ్దాలు కాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని భారతీయ జనతాపార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఓల్డ్అల్వాల్ సాయినగర్ కాలనీలోని విద్యుత్ కార్యాలయం వద్ద బస్తీ వాసులుతో కలిసి నేతలు నిరసకు దిగారు. జొన్నబండ వద్ద వడ్డెర కులస్తులు సుమారు ఏడు దశాబ్ధాలు నుంచి నివాసం ఉంటున్నారని ఓబీసీ మెర్చా రాష్ట్ర నాయకుడు దండుగుల వెంకటేష్ తెలిపారు. ఇంటి నెంబర్లు, ఆస్థి పన్ను ఉన్నా మీటర్లు ఇవ్వడానికి ఎందుకు జంకుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఫుట్‌పాత్‌లుపై వ్యాపారాలు చేసుకునే వారికి మీటర్లు ఇచ్చే అధికారులు ఇళ్ళకు ఇవ్వడంతో వచ్చిన ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నేతలు మల్లిఖార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ్, రవి, కిరణ్, మల్లిఖార్జున్ యాదవ్, మచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌ను కాంగ్రెస్ కంచుకోటగా మార్చాలి

**నాగులూరి సాయిబాబా**



నేతలు, కార్యకర్తలతో సమావేశమైన నాగులూరి సాయిబాబా

సికింద్రాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యాకర్తలు కృషి చేయాలని ప్రముఖ సంఘ సేవకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కార్యాకర్తల సమావేశం చిలకలగూడలో జరిగింది. ఈ కార్యాక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని తెలిపారు. తిరిగి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో పాగా వేయడం కోసం కార్యకర్తల సమిష్టి కృషి అవసరమన్నారు. నాయకులు, కార్యకర్తలు కనీసం వంద రోజుల పాటు పార్టీ అభివృద్ధి కోసం కంకణం కట్టుకోవాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను చైతన్యం చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యాక్రమంలో నేతలు సందీప్‌రాజు, గంట రాజు సాగర్, షబీనా, లలిత సింగ్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## పెలికాలన్ సిగ్నల్స్ ప్రారంభం



సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎసిపి వెంకట్‌రెడ్డి తదితరులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుచిత్రలోని లయోల కళాశాల వద్ద పాదచారులు రోడ్డును దాటేందుకు ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్స్‌ను మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ ఎసిపి కె.వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశానుసారం పాదచారుల సౌకర్యార్థం పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ పిఎస్ సిఐ నాగేశ్వరరావు, ఎస్సైలు ప్రశాంత్‌రెడ్డి, శ్యామ్‌బాబు, లయోల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్నటువంటి అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది నిధులను విడుదల చేయించి అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. మజ్లిస్ పార్టీతోనే కార్వాన్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ రామక్రిష్ణతో కలిసి టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో పర్య టించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న ఘనత మజ్లిస్ పార్టీకే దక్కుతుందన్నారు. నిత్యం ప్రజలు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట నాయకులు మహ్మద్ నసీరుద్దీన్, హారా న్ ఫరాన్, బద్రుదుద్దీన్, ఏఈ వెంకటశేషయ్యలతో పాటు స్థానికులు ఉన్నారు.

## మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లపై సర్వే

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కెటాయించేందుకు శుక్రవారం సికింద్రాబాద్ అర్‌డిఓ రవి, మారేడ్ పల్లి తహాశీల్దార్ పద్మసుందరీల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.ఐ.రాధిక, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మల్లేశ్వర్ రెడ్డి, నర్సింగ్, స్వర్ణ, వంశీ, సదానంద్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రికి టికెట్ ఖరారు చేయడం అభినందనీయం : యాదగిరి

కంటోన్మెంట్,ఆగస్టు 25 ప్రభాతవార్త: గ్రేటర్ ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఖరారు చేయడంతో శుక్రవారం స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి.యాదగిరి, ప్రధాన కార్యదర్శి టీ.నర్సింగ్‌రావ్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజుకుమార్, సలహాదారులు బి.బాబు,క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల పట్ల సానుకూలంగా ఉంది

**క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాజేశ్వరరావు**

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్దిదారులకు రుణ సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చ్ ఛైర్మన్, దైవసేకులు జోసెఫ్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి(పీటరాచారి) ఆధ్వర్యంలో కార్పొరేషన్ నూతన ఛైర్మన్‌గా నియమితులైన డి.రాజజేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కురియన్, పీటరాచారి మాట్లాడుతఊూ రాష్ట్ర ప్రభుత్వానికి క్రైస్తవుల పట్ల సానుకూలంగా ఉన్నారని, గతంలో క్రైస్తవ ఎమ్మెల్సీగా డి.రాజేశ్వరరావు చేసిన పనులకు గుర్తింపుగా సిఎం కెసిఆర్ ఛైర్మన్‌గా మరోసారి అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు మరోసారి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చినందుకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## 60 లక్షలతో మంచినీటి పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్తాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పోరేటర్

హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: అంబర్‌పేటలోని అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న బ్యాంకు లైన్‌లో 60 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రక్కనే ఉన్న జామ్ జామ్ మజీద్ రోడ్డులో 40 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను పరిశీలించి పురోగతి గురించి అధికారులతో మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో ఏలాంటి లోపం లేకుండా నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మంచినీటి పైప్‌లైన్ పనులు, సిసి రోడ్డు పనులు చేయిస్తున్న ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## బిఆర్ఎస్, బిజెపి పార్టీలను ఓడించకపోతే దళిత బహుజనులకు బానిసత్వం తప్పదు

**డిబిపి జాతీయ అధ్యక్షుడు వల్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరిక**

సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: తెలంగాణలో కార్పొరేట్ వ్యాపార రాజకీయాలు నడుపుతున్న బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వల్లమూరి కృష్ణస్వరూప్ సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కొక్క సీటును కోట్ల రూపాయలకు ఈ మనువాద పార్టీలు అమ్ముకుంటున్నాయని, ఇప్పటికే అడ్వాన్స్‌లు తీసుకుఉంటున్నాయని ఆరోపించారు. శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడిమా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి లక్ష కోట్ల రూపాయలు బ్లాక్ మనీతో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు సిద్దంగా ఉన్నాయని, ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియను ఖూనీ చేస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ విషపాములైన బిఆర్ఎస్, బిజెపిల ఓడించకపోతే దళిత బహుజనులకు బానిసత్వం తప్పదని హెచ్చరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న సంక్షేమసంఘం ప్రతినిధులు

దుండిగల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు శుక్రవారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి త్వరితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా కేటాయించేందుకు కెసిఆర్ ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రేమికుల కథాంశంతో వసంతరాజీయం చారిత్రక పద్యనాటకం

నాంపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : లకుమ అనే నర్తకి వసంతరాజు వద్ద వసంతోత్సవాల్లో నాట్యంచేసి రాజును మెప్పించి రాజనర్తకి అవుతుంది. నాట్యం భూమికగా వసంతరాజీయం నాట్యశాస్త్ర గ్రంథం వ్రాస్తూ ఆమె ప్రేమలో పడతాడు రాజు, ఆమె కూడా రాజును ప్రేమిస్తుంది. అనంతరం గగుర్పొల్పే పరిణామాల సాగిన ఆ ప్రేమికుల కథాంశమే వసంతరాజీయం చారిత్రక పద్యనాటకం. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ ప్రతీనెలా ప్రదర్శించే నాటకంలో భాగంగా ఈ నెల 28 సోమవారం రాత్రి 6.45గంటలకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో హయత్‌నగర్ మురళీకృష్ణ సాంస్కృతిక కళాసంఘం సమర్పణలో తడకమళ్ల రాంచందర్‌రావు రచన; అంజిరెడ్డి సోమ దర్శకత్వంలో రూపొందిన చారిత్రక పద్యనాటకం నటీనటులు అంజిరెడ్డి, వెంగమాంబ, హరినాథ్, సదానందం; డా. శ్రీజ సాదినేని; అవినాష్, సాళ్వాచారి అద్భుత నటలో వసంత రాజీయం ప్రదర్శింపబడనుందని, అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి కళాకారులను ప్రోత్సహించి ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు.

## ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఘనంగా సత్కారం

హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గం జన హృదయనేత, ప్రియతమ నాయకుడు, పేదల పెన్నిధి కాలేరు వెంకటేష్‌కు రెండోవసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సిఎం కెసిఆర్ ప్రకటించినందుకు అంబర్‌పేట బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం డివిజన్‌లోని ఎకె ప్లాజా ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో ముస్లీం, మైనార్టి సోదరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల అశీస్సులు, ముఖ్యమంత్రి కెసిఆర్ తనకు రెండోవసారి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని చెప్పారు. ఇందుకు ఆయన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు.

## కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం ర్యాలీగా సర్వే



కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం గాంధీ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ

కంటోన్మెంట్,ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ కెటాయించాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ శుక్రవారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ నుంచి గాంధీ భవన్‌కు బారీ ఊరేగింపుతో తరలివెళ్లి కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కంటోన్మెంట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరి శంకర్, నంది కంటి రవి, బద్దం బల్వంత్ రెడ్డి, దండుగుల యాదగిరి, సర్వేశ్, డి.బాబురావ్, ఆర్.డి.నాగేశ్ యాదవ్‌లతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహేంద్రహిల్స్‌లోని సర్వే నివాసం నుంచి ఊరేగింపుగా గాంధీ భవన్‌కు తరలివెళ్లారు.

## ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం కల్పించండి

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఎఐసిసి ఫిషర్ మెన్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బిజ్జు శత్రు రావు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు సమర్పించారు. గాంధీభవన్‌లో ఈ మేరకు కాంగ్రెస్ నేతలు కన్నా డానియేల్, కాంగ్రెస్ నేతలు ఖాదర్, శ్రీకాంత్, రాము, వేణు తదితరలతో కలిసి అందించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు వివరించారు. తనకు టికెట్ లభిస్తుందని ఆశిస్తున్నానని అన్నారు.

## సత్తా చాటిన భారత ఇస్రో శాస్త్రవేత్తలు



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

చార్మినార్,ఆగష్టు 25 ప్రభాతవార్త : చంద్రయాణ్-3 విజయం భారత అంతరిక్ష శాస్త్రవేత్తల సత్తాను ప్రపంచానికి చాటిందని ది ప్రొగ్రాస్ హైస్కూల్ (ఇంజన్‌బౌలి) వైస్ చైర్మన్ మీర్జా మహ్మద్ అలీ బేగ్ అన్నారు.పాతబస్తీ ఇంజన్‌బౌలి-ఫలక్‌నుమాలోని ప్రొగ్రాస్ హైస్కూల్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థులు చంద్రయాణ్-3 విజయవంతమైన సందర్బంగా సంబరాలు నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకుని విజయవంతం కోసం కృషి చేయాలని తెలిపారు.చంద్రుడి దక్షిణ ధృవంపై తొలి సారిగా అడుగు పెట్టి భారత సత్తాను ప్రపంచానికి చాటడం ఎంతో గర్వంగా ఉందని ఆయన తెలియజేశారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే శాస్త్రవేత్తలు కూడ అవుతారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మానిక్‌రావును గోషామహల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షులు వెంకటేష్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 25 ప్రభాతవార్త: గోషామహల్ టిక్కెట్ దళిత నేత మానిక్‌రావుకు కేటాంచాలని ఆరుంధతి సేవా మండలి నాయకులు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు చుడీ బజార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్బంగా ఆరుంధతి సేవా మండలి ఉపాధ్య క్షులు డి.వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ విడుదల చేసిన 115 ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అందులో గోషామహల్ నియో జకవర్గం బిఆర్ఎస్ అభ్యర్ది పేరు ప్రకటించలేదని, అందుకు మానిక్‌రావు పేరు ఎమ్మెల్యే అభ్యర్దిగా ప్రకటించాలని ఆయన కోరారు. మాణిక్‌రావుకు కేటాయిస్తే దళిత సంఘాలు పూర్తి మద్దతుతో గెలుపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధులు చంద్రమోహన్, ఎం.బాల్‌రాజ్, పి.వెంకటేష్, డి.నాగేశ్వర్‌రావు, ఎస్.కుమార్ పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో 'సూపర్ ట్విన్స్'

**సత్తాచాటిన నగర విద్యార్థులు అమయ, అనయ్ అగర్వాల్**

**అక్టోబర్ 15న ఈజిప్ట్‌లో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అవకాశం**



తల్లిదండ్రులు కోచ్‌లతో చిన్నారులు అమయ,అనయ్ అగర్వాల్

హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త: నగరానికి చెందిన సూపర్ ట్విన్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. ట్విన్స్ అంటే ఇద్దరు అబ్బాయిలు ,ఇద్దరు అమ్మాయిలు కాదండోయ్ ..ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.. గతవారం స్పెయిన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో మంచి రేటింగ్‌తో అండర్ -8 బాయ్స్, గర్ల్స్ కేటగిరీల్లో ఇద్దరూ ఛాంపియన్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోచ్ లు చైతన్య, స్రవంతిలు మాట్లాడుతూ అమయ అగర్వాల్, అనయ్అగర్వాల్ అండర్ -8, కేటగిరీలో ఇప్పటికే నేషనల్ చాంపియన్స్‌గా నిలిచి గతవారం స్పెయిన్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారన్నారు. దీంతో అక్టోబర్ 15నుంచి ఈజిప్టులో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. విజేతలు అమయ, అనయ్ అగర్వాల్‌లు మాట్లాడుతూ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు వెల్లడం చాలా సంతోషంగా ఉందని దీనికి కోచ్‌లు, తల్లిదండ్రుల సహకారం మరువలేదన్నారు. వారి ప్రోత్సాహంతోనే ప్రపంచ ఛాంపియన్స్‌గా నిలిచామన్నారు. రాబోయేరోజుల్లో అందరి సహకారంతో వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషి చేస్తామన్నారు. తక్కువ సమయంలోనే తమ పిల్లలు అత్యుత్తమ ప్రతిభతో రాణిస్తున్నారని ..అమయ, అనయ్ వరల్డ్ చాంపియన్స్‌గా తప్పక విజయం సాధిస్తారని తల్లిదండ్రులు తనాషా అగర్వాల్, వరుణ్ అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

## పట్టాలు ఇచ్చారు.. మరి ఇళ్ల సంగతేంది...!?

**-మున్సిపల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన**

**హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మూడు నెలల క్రితం హుస్నాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు అందించి ఇప్పటికీ ఇళ్లు కేటాయించకపోవడంతో శుక్రవారం మున్సిపల్ కారాలయం ఎదుట లబ్ధిదారులతోపాటు ప్రతిపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలు గడుస్తున్నా ఇండ్లు ఎందుకు కేటాయించడం లేదని నిలదీశారు. తాము కిరాయి ఇండ్లలో ఉంటూ, కిరాయిలు కట్టే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామన్నారు. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించి పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్‌టిపి నియోజకవర్గ అధ్యక్షులు అయిలేని మల్లిఖార్జునరెడ్డి, బిజెపి సీని యర్ నాయకులు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కల్లబొల్లి కబుర్లతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్

**-ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** కళ్లు లేని కబోదిలా కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని మాట్లాడడంపై ఆయన ఘాటుగా స్పందించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని ఆయన అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ఎంపిగా ఉన్నప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సవాలు విసిరారు. గతంలో కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి పబ్బం గడుపుకున్నారు తప్పితే ఈ ప్రాంత అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సిఎం కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుదని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పార్లమెంట్‌లో స్వరాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తిగా పొన్నం ప్రభాకర్ అంటే తమకు గౌరవం ఉందని ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడి అతని వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని హితవు పలికారు.

## సిద్దిపేట టికెట్‌కు దరఖాస్తు చేసిన గూడూరి శ్రీనివాస్


గాంధీభవన్‌లో సిద్దిపేట టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి)

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** సిద్దిపేట అసెంబ్లీ టికెట్ కోసం టిపిసిసి చేనేత విభాగం చైర్మన్, మాజీ ఎఎంసి చైర్మన్ గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి) శుక్రవారం హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు దరఖాస్తు ఫారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్‌గా, సిద్దిపేట ఎఎంసి చైర్మన్‌గా పని చేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తువచ్చానని తెలిపారు. గత పది ఏండ్లుగా టిపిసిసి చేనేత విభాగంగా చైర్మన్‌గా పని చేస్తూ పద్మశాలిల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అవకాశం ఇస్తే బరిలోకి దిగుతానని తెలిపారు.

## పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు : సిఐ

**హుస్నాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త :** ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట నుండి హుస్నాబాద్ వెల్లే ప్రధాన రహదారి మధ్యలోని బంజేరుపల్లి స్టేజి నుండి పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తరలిస్తున్న ఆటోను స్వయంగా ఆపి ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాలు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అనుమతికి మించి ప్రయాణికులను తరలించే తరుణంలో ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతోందని సూచించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతాలు


వరలక్ష్మి వ్రతాలు నిర్వహించుకుంటున్న మహిళలు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రతాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీ మురళీ కృష్ణాలయంలో మహిళలు పెద్దఎత్తున పసుపుబొట్టు ఇచ్చుకుంటూ వ్రతాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉప్పల వెంకటేశం, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, దూబకుంట మైత్రాములు, ఎలగందుల రామచంద్రం, తొడుపునూరి కాశినాథం, జైహింద్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం

**గజ్వేల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండపాక విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేయడం కోసం శుక్రవారం గాంధీభవన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ముందుగా దిలాల్‌పూర్ గ్రామంలోని లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుండి భారీ ర్యాలీగా గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, దివంగత ఎమ్మెల్యే సైదయ్య విగ్రహానికి, ఎమ్మెల్సీ రంగారెడ్డి విగ్రహంతోపాటు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తకు సిఎం అయ్యే అవకాశం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు గజ్వేల్‌లో ఓడిపోతానని తెలిసి కామారెడ్డిలో నిలబడుతున్నారన్నారు. పార్టీ అవకాశం ఇస్తే గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడించి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రాచకొండ ప్రశాంత్, కొండపాక విజయ్‌కుమార్

# బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎంపి


బీజేపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

**రాయపోల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెవైఎం మండల అధ్యక్షులు గల్వ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయపోల్, టెంకంపేట, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 50 మంది బిజెపి కార్యకర్తలు ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గత ఉపఎన్నికల్లో విజయం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, గెలిచిన తరువాత బొక్కబోర్లాపడ్డ బీజేపీని దుబ్బాక ప్రజలు నమ్మడం లేదన్నారు. బీఆర్ఎస్ వస్తేనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తరువాతే మన దశ, దిశ మారిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలోకి వలస పరంపర కొనసాగుతుందన్నారు. అనంతరం దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి కోసమే బిఆర్ఎస్‌లోకి సిఎం కేసిఆర్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై బిజెపినుండి బిఆర్ఎస్‌లోకి చేరినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అరికెల కరుణాకర్, గడ్డమిది రాజు, మంగలి సంతోష్, ఎండి షాదుల్,వడ్ల నరసింహాచారి, పంబాల యాదగిరి, గుంటుకు ప్రసాద్, భాను, సింగరబోయిన నాగరాజు, రమేష్, కొంగరి రాజు, కరుణాకర్, అరికెల ప్రభాకర్, లింగరావు, శ్యామ్‌రావు,గోపాల్‌రావు, రాజాగౌడ్, మహేందర్, కరుణాకర్, నవీన్, స్వామి,లక్ష్మీనారాయణ, వినిత్, చంటి, పంది స్వామి, శివ చంద్రశేఖర్‌గౌడ్, శ్రీస్వామి, శ్రీహరి, ఎల్లం,మహిశ, మైసని కనకయ్య, సురం వెంకటేశం, బోదు ఆంజనేయులు చేరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, నాయకులు హనుమండ్ల రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల రవీందర్‌గౌడ్, సర్పంచ్ కరుణాకర్, స్వామి, రాజా గౌడ్, లక్ష్మారెడ్డి, మహేష్ గౌడ్, ఎన్ రాజు, మల్లేశం పాల్గొన్నారు

## ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



సిద్దిపేట పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవాలయం 31వ వార్షికోత్సవం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారు ప్రత్యేకంగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అంకురార్పణ పూజ, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలతో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. వరలక్ష్మీ శుక్రవారం సందర్భంగా అలయ అర్చకులు పి.రామకృష్ణ చేతుల మీదుగా అభిషేకంతో పూజ కార్యక్రమాలు ప్రారంభించి సామూహిక కుంకుమార్చనలు, ఉద్యాపన పూజలు, మధ్యాహ్నం శ్రీసంతోషిమాత అమ్మవారికి నక్షత్ర హారతి, వివిధరకాల హారతుల తో అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా దేవాలయ పాలక మండలి చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ మాట్లాడుతూ వరలక్ష్మీ శుక్రవారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు దాతల సహకారంతో 3 వేల మందికి అన్నప్రసాదం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి విశ్వనాథ్‌శర్మ, మాజీ చైర్మన్లు కాచం కాశీనాథ్, వీరేశం, బండిపల్లి కిష్టయ్య, ధర్మకర్తలు గాదగోని సత్యంగౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్‌నాథ్, కళ్యాణి, మధుసూదన్‌రావు, సువర్ణ, మాజీ ధర్మకర్తలు చింత సంతోష్‌కుమార్, మాధురి, రాములు, సువర్ణలక్ష్మీ, సిబ్బంది శంకర్, స్వచ్ఛంద సేవకులు శివ, శేఖర్, దుర్గాప్రసాద్, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అండగా ఎమ్ఎస్ఎస్‌వో

**రామాయంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** 12వవార్డులో పుట్టి నర్సింలు(36) గురువారం ప్రమాదవశాత్తు మృతి చెందగా ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్ఎస్ఎస్‌వో చైర్మన్ మైనంపల్లి రోహిత్ బాధిత కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి ఇద్దరు కుమార్తెలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని, ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఎస్‌వో మరియు బిఆర్ఎస్ పట్టణ భాధ్యులు వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, పొచమ్మల గణేష్, బాదే రామరాజు, ఎమ్ఎస్ఎస్‌వో పట్టణ యూత్ అధ్యక్షులు చింటు,పుట్టి పెద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం


పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న మల్లారెడ్డి

**చిన్నశంకరంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని బిజెపి కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు జనగామ మల్లారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ముట్టడికి వెళ్లకుండా వారిని ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్న సీఎం కేసీఆర్ మాట తప్పారని, పార్టీ అనుచరులకే గృహలక్ష్మీ పథకం అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. అర్హులకే గృహలక్ష్మీ పథకాలను వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్‌గౌడ్ తదితరులున్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు అవగాహన

**మర్కుక్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్ సాగు చేస్తున్న ఆయిల్‌ఫామ్ తోటను శుక్రవారం మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ తోటలలో పూలగుత్తులను తీయుటపై అవగాహన కల్పించారు. సాధారణంగా ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటిన 14 నుండి 18 నెలల్లో పూతకు వస్తాయని, ఒక మొక్కపై ఆడ, మగ పుష్పాలు పూయగా తొలి దశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందాలంటే తొలిదశ పూలను తొలగించాలని తెలిపారు. ఈ ప్రక్రియ 30 నెలల వరకు చేసుకోవాలని సూచించారు. నూనె గింజల కన్నా ఆయిల్‌ఫామ్ పంట నూనె దిగుబడి 4 నుండి 5 రెట్లు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు దిగుబడి, ఆదాయం పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయిల్‌ఫామ్ సాగు సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రజినికాంత్, విష్ణు, రైతు రాందాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

**వర్గల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లను నమోదుచేసుకొని ఓటుహక్కును వినియోగించుకోవాలని బూత్ లెవల్ ఆఫీసర్లు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెంటూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లను చదివి వినిపించారు. ఓటరు జాబితాలో ఎవరి పేర్లు అయినా లేకపోతే వెంటనే వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం కోసం సెప్టెంబర్ 19 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపిటిసి, ఆర్ఐ, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## రామాయంపేటలో బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు

**రామాయంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరుతున్న బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్టు చేశారు. అంతకుముందు రామాయంపేట పోలీసులు పెద్ద ఎత్తున సమావేశం జరుగుతున్న స్థలంలో మోహరించారు. సమావేశం జరిగిన తరువాత నాయకులను వ్యాన్‌లోకి ఎక్కించారు. ఒకదశలో పోలీసు అధికారులకు, పార్టీ నాయకులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఉడిపి ఎమ్మెల్యే సురేష్‌శెట్టితో పాటు జిల్లా నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. సొంత పూచికత్తుపై వారిని విడిచిపెట్టారు. రామాయంపేటలో బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఉడిపి ఎమ్మెల్యే సురేష్ షెట్టి పోలీసుల తీరును ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది స్వతంత్ర్య దేశంగా లేదని, రాష్ట్రంలో ఒక నియంత పాలన సాగుతుందన్నారు. ప్రజా స్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నందారెడ్డి, నందు జనార్ధన్ రెడ్డి, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్,శంకర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మహేందర్, అశ్విని, శ్రీనివాస్,నరేంద్రచారి, దిలిప్ పాల్గొన్నారు.


బిజెపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# ముదిరాజ్‌లను విస్మరిస్తే పార్టీలకు పుట్టగతులుండవు : రాగుల రాజు


మాట్లాడుతున్న రాగుల రాజు

**జగదేవ్‌పూర్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ముదిరాజ్‌లను ఏ పార్టీలు విస్మరించినా ఆ పార్టీలకు పుట్టగతులుండవని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు, యూత్ అధ్యక్షుడు హేమ సురేష్ అన్నారు. శుక్రవారం పండుగ సాయన్న విగ్రహం గద్దె వద్ద ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బిఆర్ఎస్‌పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్‌లకు కనీసం ఒక్క సీటూ కేటాయించకపోవడం సిగ్గుచేటని, బిఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లను విస్మరిస్తుందని, అలాంటి పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామన్నారు.

**జనాభా ప్రకారం చట్ట సభల్లో అవకాశం కల్పించాలి**

జనాభా ప్రకారం రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌లకు చెందాల్సిన 12 నుంచి 15 సీట్లు కేటాయించాలని లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ రాజపేట కనకలక్ష్మి చంద్రం అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి 2001 నుంచి వెన్నంటే ఉన్నది ముదిరాజ్‌లు అని, అలాంటి ముదిరాజ్‌లకు సిఎం కెసిఆర్ ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడంపై తీవ్రంగా మండిపడుతున్నామని, బిఆర్ఎస్ పార్టీకి ముదిరాజ్‌లు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

**గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడిస్తాం...**

గజ్వేల్ నియోజకవర్గంలోని 42 వేల ఓట్లుగల ముదిరాజ్‌లను బిఆర్ఎస్ పార్టీ విస్మరించిందని, గజ్వేల్ నుంచి పోటీచేసే ముఖ్యమంత్రిని ముదిరాజ్ ఓట్లతో ఓడిస్తామని ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు హేమసురేష్ అన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు పది నుంచి 12 స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అన్ని ప్రధానపార్టీలు ఎక్కువ శాతం ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించినట్లయితే ఆ పార్టీలకు అండగా నిలుస్తామని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి రానున్న ఎన్నికల్లో పార్టీలకు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలు కొన్నె జయమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు లింగాల బిక్షపతి, మంజుల రమేష్, లక్ష్మీ చంద్రం, ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బాలకిషన్, నాయకులు బరిగె నర్సింలు, పెద్దమల్ల రాజు, గణేష్, ఎల్లేష్, బాలయ్య, రమేష్, శ్రీనివాస్, నర్సింలు, బిక్షపతి, పుల్లయ్య, యువరాజు, కనకయ్య, జహంగీర్, బాలు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండో ఎఎన్ఎంల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

## డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో రెండో ఎఎన్ఎంలను కాంట్రాక్టు ఉద్యోగులుగా తీసుకున్నారని ఐదేళ్ల తర్వాత రెగ్యులర్ చేస్తామని తెలిపారని డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని హైదారాబాద్ రోడ్డు ఎండిడిఓ కార్యాలయం సమీపంలో రెండో ఎఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 10వ రోజుకూ చేరుకుంది. ఈ సందర్భంగా అయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోయి యేండ్లు గడుస్తున్న నేటికి రెండో ఎఎన్ఎంలు కాంట్రాక్టు ఉద్యోగులుగానే పని చేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న నర్సా రెడ్డి

మంత్రి క్యాంపు కార్యాలయంకు కూత వేటు దూరంలో పది రోజులుగా సమ్మె చేస్తున్న ఆరోగ్య మంత్రి హరీష్‌రావుకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రెండో ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని లేనియెడల ఏఐటీయూసి అధ్వర్యంలో ఎఎన్ఎంలతో కలిసి అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు. రెండో ఎఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దరిపల్లి చంద్రం, డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ ఉన్నారు. సమ్మెలో ఎఎన్ఎంలు కనకలక్ష్మీ, శారద, రమ, కళ, సుశిత, సౌందర్య, వనజ పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చిలుముల వెంకటేశ్వర్లురెడ్డి

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**కౌడిపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి కృషి చేస్తారని సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి జాతీయ ఉపాధి హామి పథకం కింద రూ. 10 లక్షల నిధులను మంజూరు చేయించగా, సిసి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి తానూ కృషి చేస్తానని సర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు సంబారపు తిరుమల్లేష్, గౌడు సంఘ సభ్యులు చంద్రం దుర్గాగౌడ్, ఓబలాషి సత్యనారాయణగౌడ్, ఒ.రమేష్‌గౌడ్, పుండరీకంగౌడ్, పొన్నం మనోహర్ గౌడ్, మోతీలాల్‌గౌడ్, చంద్రం కిషోర్‌గౌడ్, ఓ.మల్లికార్జున్‌గౌడ్, చిన్నగౌడ్, ప్రభాకర్‌గౌడ్, గోనెగారి సతీష్‌గౌడ్, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల పితామహుడు బిపి మండల్


బిపి మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిఎస్పీ నాయకులు

**గజ్వేల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు గూడూరి కరుణాకర్ అధ్యక్షతన గజ్వేల్ పట్టణంలోని టివైఆర్ గార్డెన్‌లో బిపి మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కరుణాకర్ మాట్లాడుతూ బిసిలకు అమలులో లేని విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోసం జీవితాన్ని త్యాగం చేసి బిసిల జీవితాలలో వెలుగులు నింపిన వ్యక్తి బిపి మండల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కటికల ఓంప్రకాష్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేతోజి వినోద్‌చారి, కొండనోల్ల నరేష్, ఉపాధ్యక్షుడు ఎల్లం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కానుగుల రమణాకర్, కోశాధికారి మొండి కరుణాకర్, కార్యదర్శి కోట మహేందర్, ఈసి మెంబర్ ఆశాని కనకప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పోటీ చేయడం గజ్వేల్‌కే గర్వకారణం

**-ఎఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్**


మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సిఎం కెసిఆర్ మూడోసారి పోటీచేయడం గజ్వేల్ నియోజకవర్గానికే గర్వకారణమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధకుని గా 2014లో గజ్వేల్‌లో కెసిఆర్ అడుగు పెట్టిన రోజు నుండి తొమ్మిదేళ్లలో గజ్వేల్ అన్ని రంగాలలో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి ఇదేవిధంగా కొనసాగాలంటే కెసిఆర్‌తోనే సాధ్యమన్నారు. గజ్వేల్‌లో ఎవరు పోటీచేసినా ప్రతిపక్షాలు డిపాజిట్ల కోసమే పోటీ తప్ప కెసిఆర్ విజయాన్ని ప్రజలు ఎప్పుడో ఖాయం చేశారని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్‌ను ఏకపక్ష మెజార్టీతో గెలిపించి మరోసారి గజ్వేల్ ప్రతిష్టను, గౌరవాన్ని పెంచుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, ఏఎంసి డైరెక్టర్ ప్రవీణ్, బిఆర్ఎస్‌నాయకులు నిజాముద్దీన్, శివకుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రసమయికి ఘన స్వాగతం


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**బెజ్జంకి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ మానకొండూరు శాసన సభ అభ్యర్థిగా సిఎం కెసిఆర్ ప్రకటించిన తర్వాత మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత, పాకాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ. లక్ష ఆర్థిక సహాయం

**మర్కుక్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో గురువారం టిప్పర్ లారీ ఢీకొట్టడంతో గంగాపూర్ గ్రామానికి చెందిన విశాల్‌సింగ్, యూసుఫ్‌ఖాన్‌పల్లికి చెందిన శ్రీరాంబాబు మృతిచెందారు. విషయం తెలుసుకున్న రైతుబంధు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇరు కుటుంబాలను శుక్రవారం పరామర్శించి స్థానిక సర్పంచ్ గడ్డం ప్రసాద్, ఉపసర్పంచ్ జగదీష్‌సింగ్‌లతో కలిసి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం తరపున సహాయం అందేలా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకులు రఘువీర్ సింగ్, బీర్బల్‌సింగ్, జగన్నాథ్‌సింగ్, రాంసింగ్, టీకారాం, శంకర్ సింగ్, చరణ్ సింగ్, జూపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

## రాష్ట్ర సాధనలో దివ్యాంగుల పాత్ర చాల కీలకం : ఎమ్మెల్యే

**బెజ్జంకి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర సాధనలో దివ్యాంగుల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని సత్యార్జున ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం దివ్యాంగులకు పెంచిన అసరా పెన్షన్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు అత్మన్యూనతా భవాన్ని తొలగించేందుకు సర్కారు చర్యలు తీసుకుంటూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.200 పెన్షన్ ఉండేదని నేడు రూ. 4 వేలకు పెంచడం జరిగిందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గృహలక్ష్మీ పథకంలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు పెన్షన్ పెంపుదలతో సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే బాలకిషన్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత, మంజుల, కచ్చు చంద్రకళ, పాకాల మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా, శేఖర్‌బాబు, శ్రీనివాస్, దీటి రాజు, ఇంచార్జి ఎంపిడిఓ అంజయ్య, తహశీల్దార్ వెంకటరెడ్డి, ఎంపిఓ విష్ణు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే



సిఎం కేసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే మాణిక్‌రావు కృతజ్ఞతలు

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** జహీరాబాద్ శాసన సభ స్థానం నుంచి మరో మారు బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచేందు అవకాశం కల్పించిన బిఆర్ఎస్ అదినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. హైద్రాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలుగసుకుని పూలబొకేను అందించి ఆశీస్సులు అందుకున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి కేసిఆర్‌కు అందుకు సహకరించిన మంత్రులు తన్నీరు హరీష్‌రావు, కల్వకుంట్ల తారక రామారావులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు దన్యవాదాలు తెలిపారు.

## బిసి బంధుతో క్షవరణ దుకాణం ఏర్పాటు



బిసి బంధుతో తపుగొండలో క్షవరం దుకాణాన్ని నడుపుకుంటున్న మంగలి శేఖర్

**కంది, ఆగస్టు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న బిసి బంధు పథకంలో లబ్దిపొందిన మండలంలోని తోపుగొండ గ్రామానికి చెందిన మంగలి శేఖర్ శుక్రవారం గ్రామంలో క్షవరం (కట్టింగ్ షాప్)ను ప్రారంభించారు. ప్రభుత్వం అందచేసిన సహకారంతో గ్రామంలో సెలూన్ దుకాణం ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని శేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంగల్ గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి విక్రాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు

**పుల్కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ భాస్కర్‌ను బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. కార్యక్రమంలో పుల్కల్ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్‌చారి, బిఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అబిక్ ,సింగూర్ నాయకులు మల్ల వీరారెడ్డి, మన్నే విజయకుమర్ తదితరులు ఉన్నారు.

## రాములును సన్మానించి జడ్పీటిసి నరేష్

**ఝరాసంగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎంజి రాములను శుక్రవారం జడ్పీటిసి సభ్యులు వినీల నరేష్ ఘనంగా సన్మానించారు. ప్రజా నాయకులు రాములు యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామని నరేష్ కొనియాడారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, ఇప్పెపల్లి సర్పంచ్ గోపాల్, గొడిగార్‌పిల్లి రాచన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను సన్మానించిన స్వర్ణకారుల సంఘం



మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సన్మానిస్తున్న స్వర్ణకారుల సంఘం బాధ్యులు

**సదాశివపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:** సంగారెడ్డి శాసన సభ నుంచి రానున్న శాసన సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అవకాశం కల్పించడంతో స్వర్ణకారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శక్రవారం పట్టణంలోని చింత ప్రభాకర్ కార్యాలయంలో స్వర్ణకారుల సంఘం నాయకులు నర్సింగ్‌రావు, నాగభూషణం, శ్రీనివాస్, భారది బాల్‌రాజు, మనోహర్, ఆంజనేయులు, కిరణ్, నాగరాజు, శ్రీనివాస్, భను ప్రకాష్ తదితరులు చింత ప్రభాకర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభం

**రామాయంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** రామాయంపేట పట్టణంలో శుక్రవారం నాడు బిజెపి పార్టీ కార్యాలయాన్ని బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే సురేష్ షెట్టి ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బానప్పగారి సుధాకర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందుజనార్ధన్‌రెడ్డి, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్,అసెంబ్లీ కన్వీనర్ మధు, బిజెపి అధికార ప్రతినిధి నందారెడ్డి, రాయంపేట పట్టణ అధ్యక్షులు జయశంకర్‌గౌడ్,నిజాంపేట మండల అధ్యక్షులు శేఖర్,దయానందరెడ్డి, బిజెపి వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

# గ్రామాల్లో అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే శ్రీకారం

### పనులు ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భూవమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. బిఆర్ఎస్ సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రకటించాక తొలి మారు మండలంలోని వెంకటపూర్, ఇశ్రితాబాద్, ఎన్కేపల్లి గ్రామాలకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్‌ను గ్రామస్థులు, బిఆర్ఎస్ నాయకులు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. మండలంలోని వెంకటపూర్లఓ 13లక్షలతో, ఇశ్రితాబాద్‌లో 20 లక్షలతో నిర్మించనున్న పంచాయితీ భవనాల నిర్మాణానికి, ఎన్కేపల్లిలో 5లక్షలతో ఈద్గా, మరో 5 లక్షలతో చర్చి నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లొ నెలకొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృషికి ప్రజలు తీసుకురాగా సమస్యల పరిష్కారానికి చింత ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయితీ రాజ్ ఈఈ జగదీశ్వర్, డిప్యూటీ దీపక్, ఎంపిపి అధ్యక్షుల తొంట యాదమ్మ కిష్టయ్య, రైతు బంధు అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ సడాకుల కృపాకుమార్, వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ సుధీర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి అరిఫోద్దిన్, ఎంపిటిసి సత్యనారాయణ, సునీత సుధాకర్, సంతోష్‌గౌడ్, అల్లం లలిత అమ్మద్ షబ్బీర్, సర్పంచులు సునంద బాలమణి కోడూర్ రాములు, లక్ష్మారెడ్డి, శ్రీహరి, సలావుద్దీన్, శేఖర్, శ్రీనివాస్, శ్రీవాణి దశరథ్, నరేష్ గౌడ్, నల్లుల కుమార్, కృష్ణ, సిద్దన్న, రమేష్, నగేష్, మాజీ ఎంపిటిసి శివకుమార్, శ్రీనివాస్, మాజీ సర్పంచులు మాణిక్, గడ్డమీర్, సత్యం, మార్కెట్ కమిటి డైరెక్టర్లు రాములు, నవీన్‌కుమార్, హరపుద్దీన్, కరుణాకర్, సొసైటీ డైరెక్టర్ విఠల్‌రెడ్డి, నాయకులు చోటు మియా, విజయభాస్కర్‌రెడ్డి, సామేల్, శివరాం, రాజు, శంకర్, వీరయ్య, సుభాస్, రాజు, ప్రసాద్ గౌడ్, శ్రీశైలం, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో పంచాయితీ భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్



బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బిజెపి నాయకులకు ఖండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## బిఆర్ఎస్‌లో చేరిన ఆయా పార్టీల నాయకులు

**-పార్టీ ఖండువాలు కప్పిన ఎమ్మెల్యే మాణిక్‌రావు**

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండలంలోని ఖంజమాల్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు, బిజెపి నాయకులు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వార్డు సభ్యులు గొల్ల నర్సింలు తన అనుచరులతో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు నారాయణ, గ్రామ సర్పంచ్ ప్రసాద్, నాయకులు సురేష్, మోహన్‌రెడ్డిల సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పార్టీలో చేరిన కాంగ్రెస్, బిజెపి నాయకులు సిద్దప్ప, విఠల్, తుకారాం, గణేశ్, జైపాల్, ప్రశాంత్, నరేష్, శ్రీశైలం, గణేష్, సిద్దన్న, రామ్, మహిపాల్, మోహన్‌రావు, అన్నపురం అశోక్, గొల్ల పరశురాం, బి వీరన్న, జమాల్, కైలాష్, రామ్ తదితరులను పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

## రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పోరేటర్



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్‌ను దశల వారిగా అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి 80 లక్షల రూపాయలు మంజూరు కావడంతో కాలనీ వాసులతో కలిసి సిసి రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో కొనసాగుతున్న పార్కు నిర్మాణ పనులను కార్పోరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ డీఈ నరేందర్, ఏఈ ప్రభు, కాలనీ అధ్యక్షులు రఘురాంరెడ్డి, విఠల్, క్రిష్ణరెడ్డి, అరుణ్ సింగ్, బలరాం, భద్రయ్య, శాంతారాం, యాదయ్య, తారాసింగ్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఘనంగా నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహా ప్రతిష్ట

**రామాయంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంతం ప్రతి గ్రామంలో గ్రామ రక్షణ దేవతగా వెలుగొంది నల్ల పోచమ్మ శివుని పుత్రికగా శివునితో అమ్మకోసం పోరాటం చేసిన ఉగ్ర స్వరూపిణిగా కోలుస్తారు. ఆమె యొక్క కథ... మరియు పూజా విధానము... తెలంగాణ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఎల్లమ్మ,మారేడమ్మ, ఊరడమ్మ,, మత్తడి పోచమ్మ ఇలా ఎందరో గ్రామ దేవతలను తెలంగాణ ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో తమలను రోగాల నుండి భూత,ప్రేత,పిశాఛాల నుండి కాపాడుతారని మొక్కుకోని,మొక్కులను చెల్లించుకుంటారు. అమ్మవారి దయ కోసం ఆమెకు పూజలు నిర్వహిస్తుంటారు. రామాయంపేట పట్టణంలోని స్వాతంత్ర్యానికి ముందే బ్లాక్ ఆఫీస్ మంగిట రావి చెట్టు కింద అమ్మవారిని నిలబెట్టడం జరిగింది. సుమారు 80 సంవత్సరాల క్రితం రామాయంపేటలో వచ్చిన ప్లేగు వంటి వ్యాధులకు అమ్మవారికి మొక్కి ప్రతిష్టించగానే రోగాలు మాయమయ్యాయని అందుకే రామాయంపేట నల్ల పోచమ్మభక్తులకు కొంగుబంగారంగా ముడుపులు కట్టడానికి పెళ్లిల్లు జరిగినప్పుడు అమ్మవారిని పూజించడమే కాకుండా బోనాల ఊరెగింపు, ప్రతి రోజు కూడ నిత్యపూజలు సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శుభదీనాన అమ్మవారి ఊరెగింపు ప్రతిష్ట కార్యక్రమంలో మూడు రోజుల పాటు కొనసాగించనున్నారు. ప్రతిష్టానంతరం సోమవారం అమ్మవారికి గ్రామంలోని కుల సంఘాల నుండి ముదిరాజ్ సంఘం నుండి ముఖ్యంగా బోనాల ప్రదిక్షణ జరుగుతుందని ముదిరాజ్ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.



ఎమ్మెల్యే అభ్యర్థిగా ధరఖాస్తు చేసుకుంటున్న రవీందర్‌రెడ్డి

## ఎమ్మెల్యే అభ్యర్థిగా రవీందర్‌రెడ్డి దరఖాస్తు

**కొల్చారం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో శాసన సభకు పోటీ చేసేందుకు ధరఖాస్తు చేసుకున్నట్లు సోమన్నగారి లక్ష్మి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంల కేంద్రమైన కొల్చారంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో మెదక్ జిల్లా నర్సాపూర్ శాసన సభ స్థానానికి ధరఖాస్తు చేసుకున్నట్లు ప్రకటించారు. టిపిసిసి ఉపాధ్యక్షుల కుమార్‌రావుకు ధరఖాస్తు పత్రాలను అందచేశానన్నారు. కార్యక్రమంలో పైతర సర్పంచ్ వెల్మకన్నె సంతోష ఎల్లేశం తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందచేస్తున్న ఉపాధ్యాయులు

**కొల్చారం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో 9, 10వ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం స్కాలర్ షిప్ రూపంలో నగదును అందచేశారు. మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కెమురా విద్యా జ్యోతి స్కీం పథకంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో మొదటి స్థానంలో నిలిచిన వారికి 5వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న వారికి 2500 రూపాయల చొప్పున డిడిలు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డివిజన్ మేనేజర్ సత్య రమేష్, పోతంశెట్టిపల్లి బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్, కొల్చారం మేనేజర్ పవన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రవిచంద్ నాయక్

**చిన్నశంకరంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షునిగా రవిచంద్ నాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 30 సంవత్సరాలుగా పార్టీలోనే ఉంటూ పనిచేస్తున్నానని, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని రవిచంద్ నాయక్ తెలిపారు. తన నియామకానికి మద్దతు తెలిపిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం బాలక్రిష్ణ,సుప్రభాత్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు మోహన్ నాయక్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న బెల్లయ్య నాయక్

# ఘనంగా వరలక్ష్మి వ్రతాలు

**పుల్కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పవిత్ర శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం రోజును వరలక్ష్మి వ్రతాలు జరుపుకోవడం హిందూ సంప్రదాయం. ఇందులో భాగంగా రెండవ శుక్రవారమైన ఈ నెల 25వ తారీఖున మండల కేంద్రమైన పుల్కల్, చౌటకూరు గ్రామాలతో పాటు ఆయా మండాల్లోని గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు తమ చిన్నారులతో చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ తమ ఇండ్లలో వరలక్ష్మి అమ్మవారిని ప్రతిష్టించుకుని కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుకున్నారు.

**జహీరాబాద్ పట్టణంలో..**

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పవిత్ర శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను నోచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం మహిళలు తమ తమ గృహాల్లో వరలక్ష్మి విగ్రహాలను ప్రతిష్టిం కుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో 50 మంది మహిళలు వత్రాలను నోచుకున్నారు. పూజా కార్యక్ర మాల్లో ఉపాధ్యాయులు అరుణ, స్వరూప, నాగలక్ష్మి, మాణిక్యమ్మ, సువర్ణ, లక్ష్మి, రాజేశ్వరి, కల్పన, అనురాధ, అనత, మంజుల, సోనీ, విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం వెంకటయ్య పేర్కొన్నారు.



**వరలక్ష్మిగా దర్శనమిచ్చి వనదుర్గా భవాని మాత**

**పాపన్నపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:** శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతాన్ని పురష్క రించుకుని శుక్రవారం ఏడుపాయల వనదుర్గా భవాని మాతను వరలక్ష్మి మాతగా అలంకరించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు వనదుర్గా భవాని మాత వరలక్ష్మి మాతగా దర్శనమిచ్చింది. ఆలయ పూజారులు శంకర్ శర్మ, పార్థివ శర్మ అమ్మ వారిని శ్వేత వర్ణపు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ బాలగౌడ్, ఆలయ ఇఓ సార శ్రీనివాస్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్గిలో ఉచిత డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ

**న్యాల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వాహన చోదకులకు విధిగా లైసెన్సులు ఉండాలన్న ఉద్దేశంలో స్థానిక శాసన సభ్యులు యువతకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందచేసే కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్గి గ్రామానికి చెందిన యువకులు డ్రైవింగ్ లైసెన్సుల కొరకు ఇటీవల ధరఖాస్తు చేసుకోగా శుక్రవారం గ్రామానికి చెందిన 15 మందికి డ్రైవింగ్ లైసెన్సులను గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు జెల్గొండ మారుతి యాదవ్ లైసెన్సులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారుతి యాదవ్ మాట్లాడుతూ వాహనాలను రోడ్డు పైకి తీసుకొచ్చే వారు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు పొంది ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు బిఎల్‌ఓలు కృషి చేయాలి

**-బిఎల్‌ఓలతో ఇంచార్జి తహసీల్దార్**



బిఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న ఇంచార్జి తహసీల్దార్ శివరామ్‌క్రిష్ణ

**నాగల్‌గిద్ద, ఆగస్టు 25, ప్రభాతవార్త:** త18 సంవత్సరాల వయసు నిండిన వారు ఓటురుగా నమోదు చేసుకునేందుకు బిఎల్‌ఓలు తమ వంతు కృషి సల్పాల్సిన అవసరం ఉందని ఇంచార్జి తహసీల్దార్ శివరామ్‌క్రిష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన నాగల్‌గిద్ద రెవిన్యూ కార్యాలయంలో బిఎల్‌ఓలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి తహసీల్దార్ శివరామ్ క్రిష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. సెప్టెంబరు 19వ తారీఖు వరకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, విషయాన్ని గ్రామాల్లో టాంటాం ద్వార అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని శివరామ్‌క్రిష్ణ వివరించారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

## కొండాపూర్‌లో జాతీయ విపత్తుపై అవగాహన



జాతీయ విపత్తులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కొండాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొండాపూర్‌లో శుక్రవారం అధికారులు గ్రామస్థులకు జాతీయ విపత్తుపై అవగాహన కల్పించారు. జాతీయ విపత్తుల ప్రతి స్పందన దళం 10వ బెటాలియన్ ఇన్స్‌పెక్టర్ ముకేష్‌కుమార్, ఎఎస్ఐ ఆర్ మద్దిలెట్టి నేతృత్వంలో గ్రామస్థులకు వరదలు, భూకంపాలు, కెమికల్ లీకేజీలు వంటి విపత్తులు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, మధులత, ఎంపిడిఓ, ఆర్ఐ రాజు, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## నేడు చలో చేవెళ్ల

**కొల్చారం ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఈ నెల 26 తారీఖున కెవిఆర్ గ్రౌండ్ చేవెళ్లలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పుల్లబోయిన దుర్గేష్ పేర్కొన్నారు. చేవెళ్లలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత, గిరిజనులకు చేస్తున్న మోసంపై తిరగబడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

## సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్ సంజీవ్‌రావుకు వినతి పత్రం అందచేస్తున్న మీ-సేవ నిర్వాహకులు

**ఝరాసంగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** తామొదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మీ-సేవా నిర్వాహకులు శుక్రవారం తహసీల్దార్ సంజీవరావుకు వినతి పత్రం అందచేశారు. మీ-సేవ కార్యకలాపాలతో తమకు ఎదురవుతున్న సమస్యలను లిఖిత పూర్వకంగా తహసీల్దార్‌కు అందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మీ-సేవా నిర్వాహకులు రవి, సునీల్, శివశంకర్‌లు వినత చేశారు.

## గ్రామ గ్రామాన జోరుగా హస్తం ప్రచారం



సంగాయపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చిన్నశంకరంపేట,ఆగస్టు 25,ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధి సంగాయపల్లిలో వైస్ ఎంపీపీ ఐరెని సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ నాయకులు చేసిన డిక్లరేషన్‌ను ప్రతి గ్రామంలో వివరిస్తామని తెలిపారు. అధికారంలోకి రాగానే రైతులకు 2 లక్షల రుపాయల రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిఆర్ఎస్ నాయకులు చెస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కేవలం కాంగ్రెస్ మాత్రమే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శివప్రసాద్, ప్రసాద్‌గౌడ్, నాయకులు నవీన్,రమేష్,మణికంఠ, శ్రీకాంత్ గౌడ్, శివ,శ్రీనివాస్, నర్సా గౌడ్,ఆంజనేయులు, నర్సింలు, కుమార్, మధు, కొటిరాజు తదితరులున్నారు.